

సాక్షి పెద్దపల్లి

గురువారం । 15 । ఆగస్టు । 2024

సీఐఎస్‌ఎఫ్ జవాన్ల బైక్ ర్యాలీ

జ్యోతినగర్: సీఐఎస్‌ఎఫ్ అధికారులు, సిబ్బంది బుధవారం జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. మల్కాపూర్ రోడ్డులోని సీఐఎస్‌ఎఫ్ బ్యారక్స్ వద్ద ర్యాలీ ప్రారంభించారు. మేడిపల్లి సెంటర్, ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్, బి–గేట్ కాకతీయ తోరణం వరకు అక్కడి నుంచి బ్యారక్స్ వరకు ర్యాలీ కొనసాగింది. సీఐఎస్‌ఎఫ్ సీనియర్ కమాండెంట్ ముఖేశ్ కుమార్ పర్యవేక్షణలో అధికారుల సహకారంతో ర్యాలీ నిర్వహించారు.



బాపూజీ కీర్తి.. స్వాతంత్య్ర స్ఫూర్తి



ఏ దేశమేగినా.. ఎందుకాలిడినా..
ఏ పీఠమెక్కినా.. ఎవ్వరేమనినా..
పొగడరా నీతల్లి భూమి భారతిని..
నిలుపరా నీ జాతి నిండు
గౌరవమును..

1947 ఆగస్టు 15న ఆంగ్లేయుల బానిసత్వం నుంచి విముక్తి కలిగింది. అదేరోజు దేశానికి స్వాతంత్య్రం సిద్ధించింది. ప్రపంచంలో ఎక్కడున్నా భారతీయులందరూ పంద్రాగస్టును పండుగలాగా జరుపుకుంటారు. మనమంతా స్వేచ్ఛగా ఉన్నామంటే ఎందరో సమరయోధుల త్యాగాల ప్రతిఫలం. వారు దేశాన్ని ఎలా గొప్పగా చూడాలని కలలు కన్నారో.. ఆ కలలను సాకారం చేయడం మనందరి కర్తవ్యం. దేశ కీర్తిప్రతిష్టలు పెంపొందించడం అందరి బాధ్యత. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకోవడం మన ధర్మం. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా పలు గ్రామాలు స్వాతంత్రోద్యమం నడిపిన బాపూజీ బాటలో నడుస్తున్నాయి. ఆయన కలలు నిజం చేసేందుకు కదులుతున్నాయి. ఏ గ్రామంలో ఏ ప్రత్యేకత ఉంది.. ఎవరు ఎలా ముందుకెళ్తున్నారు.. ఎవరి ఆశయం ఏంటి తదితర వివరాలతో ప్రత్యేక కథనం..



తన ఇంటినే గ్రంథాలయంగా మార్చిన వీరగోని ఆంజనేయులు

ఎర్రకోటపై 'వావిలాల' జెండా రెపరెపలు



వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్, జాతీయ జెండా

జమ్మికుంట: దేశ స్వాతంత్య్ర ఉద్యమ సమయంలో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్ ఊపిరిపోసుకుంది. ఇక్కడి ఖాదీతో తయారైన జాతీయజెండా దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటపై రెపరెపలాడింది. మహాత్మాగాంధీ పిలుపుమేరకు విదేశీ వస్త్రాల బహిష్కరణ, స్వదేశీ వస్త్రాల తయారీ ఉద్యమంలో భాగంగా ఆయన శిష్యులు అన్నా సాహెబ్ సహస్త్ర బుద్దె, లేలేజీ వావిలాల పరిసరాల్లో పర్యటించారు. గ్రామంలో 1929లో మహారాష్ట్ర చరఖా సంఘ్‌ను ప్రారభించారు. 1951లో శ్రీరామనంద తీర్థ, అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో భాగ్యనగర్ ఖాదీ సమితి పేరుతో పునః ప్రారంభిచారు. భాగ్యనగర్ సంస్థ నుంచి 1967లో మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్ విడిపోయింది. అప్పటి దేశ్‌ముఖ్ ఎక్కటి అన్నారెడ్డి సంస్థ కోసం ఏడెకరాలు విరాళంగా ఇచ్చారు. 1983లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్ ఏర్పడింది. కాగా.. 1972లో దేశ రాజధాని ఢిల్లీలో ఆగస్టు 15, జనవరి 26 సందర్భంగా ఆవిష్కరించిన జాతీయ జెండాలు వావిలాల ఖాదీలో తయాలు చేసినవే. ప్రస్తుతం బెంగళూరు ఖాదీ సంస్థ జాతీయ జెండాలను తయారు చేస్తోందని ఖాదీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. వావిలాల ఖాదీ చైర్మన్‌గా పీవీ నరసింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, కిషన్‌రావు కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

జగిత్యాల నిత్య జనగణమనకు ఆరేళ్లు

జగిత్యాలటౌన్: ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా జిల్లాకేంద్రంలో ఉత్తూరి గంగాధర్ నేతృత్వంలో 60 మందితో ప్రారంభించిన నిత్యజనగణమన ఆరేళ్లకు చేరుకుంది. జగిత్యాల గడియారం స్తంభానికి నలువైపులా ఏర్పాటు చేసిన మైకుల ద్వారా ప్రతీరోజు ఉదయం 9.15 గంటలకు జాతీయగీతం ప్రారంభమవుతుంది. ఆ సమయంలో అక్కడికి వచ్చేవారు జాతీయ గీతాలాపనలో పాల్గొని దేశభక్తిని చాటుతున్నారు. 2018 అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజు ప్రారంభించిన కార్యక్రమం 2,140రోజులుగా కొనసాగుతోంది.

పెగడపల్లిలో 30 నెలలుగా..

పెగడపల్లి: స్థానిక అంబేడ్కర్‌చౌరస్తాలో 2022 ఏప్రిల్ 10వ తేదీ నుంచి నిత్య జనగణమన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. బస్టాండ్ ప్రాంతంలో వ్యాపారులు, ప్రయాణికులు ఉదయం 9గంటలకు జరిగే జాతీయ గీతాలాపనలో పాల్గొంటున్నారు.



జాతీయ గీతాలాపనలో జగిత్యాల ప్రజలు

మాట్లాడుకుందాం రమ్మని జైల్లో పెట్టిన్రు



సైదాపూర్: ఎలబోతారం, రాములపల్లి, ఎల్లంపల్లిలో 200 మందిమి ఒక్కటై రజాకార్లను ఎదిరించినం. మాలో నలుగురు వారి చేతిలో చనిపోయింన్రు. గుజ్జుల పుల్లారెడ్డిని ముక్కలుగా నరికి చంపిన్రు. ఎకరం ఉన్నోడికి తాసీల్ కింద ఆరు కుంచాల వడ్లు లేదా రూపాయి పావలా వసూలు చేసిన్రు. పన్ను కట్టనోళ్లను వంగబెట్టి మీద బండలు ఎత్తిన్రు. ఈ దురాగతాలు భరించలేక ఎదురుతిర్గినం. మమ్మల్ని పోలీసులతో కొట్టించిన్రు. గప్పుడే హైదరాబాద్ దొరసింగ్ మా కాడికి అచ్చిన్రు. మాలో చైతన్యం తెచ్చిన్రు. రక్షణ కోసం శత్రువుపై దాడి చేయడానికి ఒడిసెలు, సంచి నిండా పలుగురాళ్లు, బరిసెలు, కత్తులు, గొడ్డండ్లు ఆయుధాలుగా వాడినం. రజాకార్లలో ఒకడిని, ప్రభువును చంపినం. ఇగ గొడవలు అద్దు. మాట్లాడుకుందాం.. రమ్మన్నరు. ఎలబోతారంలో డేరా ఏసిన్రు. ఖాసీంరజ్వీ అక్కడికి పిలిచిన్రు. నమ్మినం. 130 మందిమి అక్కడికి పోయినం. ఖాసీం సైన్యంతో మా బట్టలు ఇప్పించిన్రు. మా చేతులు వెనక్కి కట్టించిన్రు. రాములపల్లి, గొడిశాల, బొమ్మకల్, అమ్మనగుర్తి నుంచి హుజూరాబాద్ వరకు నడిపించిన్రు. అక్కడ జైల్లో పెట్టిన్రు. 40 మందిని స్వాతంత్య్ర సమరయోధులుగా ప్రభుత్వం గుర్తించింది.

– అంగిరిక రాజలింగం, సమరయోధుడు, ఎల్లంపల్లి, సైదాపూర్

సైనికుల కొండ.. మారేడుగొండ

పెద్దపల్లిరూరల్/శంకరపట్నం: పెద్దపల్లి మండలం మారేడుగొండ గ్రామం నుంచి సుమారు 20 మందికి పైగా యువకులు సైన్యంలో వివిధ ర్యాంకుల్లో పనిచేస్తున్నారు. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన యువకులు కూడా ఆర్మీలో ఉన్నారు. పిడుగు హరీశ్ అతని సోదరుడు ఆర్మీలోనే పనిచేస్తున్నారు. అదేవిధంగా కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఏరడపల్లి గ్రామం నుంచి జంగిలి శ్రీనివాస్‌యాదవ్ మొట్టమొదట సైన్యంలో చేరాడు. ఆయన బాటలో 26మంది యువకులు సైన్యంలో చేరి సేవలందిస్తున్నారు.

దేశభక్తి పెంపొందించుకోవాలి



యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి. దేశరక్షణకు పాటుపడాలనే తపన అందరిలోనూ ఉండాలి. దేశసేవ చేయడంలో ఎంతో తృప్తి ఉంటుంది. పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేలా సైన్యంలో చేరా. దేశ సేవలో నావంతు బాధ్యతలు నిర్వర్తిస్తున్నా.

– టి.ప్రశాంత్, మారెడుగొండ

మా ఊరు ప్రత్యేకం



సీఆర్‌పీఎఫ్ తదితర విభాగాల్లో మా ఊరి నుంచి ఎక్కువ మంది పనిచేస్తున్నారు. దీంతో మా మారేడుగొండకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. 2015లో సైన్యంలో చేరిన. అరుణాచల్‌ప్రదేశ్ ప్రాంతంలో చైనా సరిహద్దు దాకా వెళ్లి పనిచేయడం ఎంతో అనుభూతినిచ్చింది.

– వి.మధుకర్, మారెడుగొండ



సాయిరాం



కొత్వాల సాయి సేకరించిన చిత్రాలు

'మహా'త్ముల జ్ఞాపకాలు పదిలం

సిరిసిల్లటౌన్: స్వాతంత్య్ర సంగ్రామంలో భారతజాతిని చైతన్య పరిచిన జాతీయ నాయకుల పోరాటాల జ్ఞాపకాలను సిరిసిల్లకు చెందిన కొత్వాల సాయిరాం పదిల పరిచాడు. సుమారు 3,500కు పైగా వ్యాసాలు, ఫొటోలు సేకరించాడు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం ఫొటోలు, దేశభక్తిని ప్రబోధించే చిత్రాలను సృజనాత్మకంగా భద్రపరిచారు. ఇప్పటికీ వంద దేశాలకు పైగా స్టాంపులు సేకరించాడు. 1947లో దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటపై ఎగురవేసిన తొలి జెండావిష్కరణ ఫొటో ఆయన వద్ద ఉంది. గాంధీజీపై ఉన్న అభిమానంతో ఆయన ఛాయాచిత్రాలను వందల సంఖ్యలో సేకరించాడు.

రక్షణ కవచాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సూచనలిస్తున్న మహిపాల్‌రెడ్డి, శిరీష

పెద్దపల్లిరూరల్: కల్లు గీతకార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం అందుబాటులోకి తీసుకొచ్చిందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ అధికారి మహిపాల్‌రెడ్డి సూచించారు. పెద్దకల్వలలోని గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం వినియోగంపై బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి అనిల్‌తో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ శిరీష, ఎస్సై జీవన్‌రెడ్డి, పావనితోపాటు సంతోష్, కృష్ణ, వనిత, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు



వేడుకలకు ముస్తాబైన పరేడ్ గ్రౌండ్

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ముఖ్య అతిథి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్ ఆవరణలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్ ఆవరణలో గురువారం జరిగే పంద్రాగస్టు వేడుకల(స్వాతంత్య్ర దినోత్సవం)కు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. వేడుకలు నిర్వహించే ప్రాంతాన్ని వివిధ రంగవల్లులతో ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, పలువురు జిల్లా అధికారులతో కలిసి బుధవారం ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

ముఖ్యఅతిథి శారద..

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. కలెక్టరేట్ ఆవరణలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొని జిల్లా ప్రగతి నివేదికను శారద చదివి వినిపించనున్నారు.

గురుకులాల్లో మెరుగైన సేవలు

జిల్లాలోని గురుకులాలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి గురుకులాల్లో సేవలపై సమీక్షించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చిమొక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే ఇన్‌చార్జిలు, వార్డెన్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఈవో మాధవి, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీపీవో ఆశాలత, నాగలైశ్వర్ తదితర అధికారులు ఉన్నారు.

భూసేకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

మంథని: వరంగల్– మంచిర్యాల జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. జాతీయ రహదారి కోసం చేపట్టాల్సిన భూసేకరణ, పెండింగ్ ధరణి సమస్యలు, వివిధ సర్టిఫికెట్ల జారీ తదితర అంశాలపై ఆర్డీవో హనుమా నాయక్‌తో కలిసి సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భూసేకరణ వేగవంతంగా పూర్తిచేయాలని, రైతులు కలెక్టర్ వద్దకు ఆర్బిట్రేషన్‌కు వచ్చేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. పెండింగ్ ధరణి దరఖాస్తులను ప్రణాళిక ప్రకారం పరిష్కరించాలని సూచించారు. మీసేవ కేంద్రాల ద్వారా సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిశీలించి జారీ చేయాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మంథని: హరియాణాలోని పంచకుల ఒలింపిక్ భవన్‌లో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే జాతీయ కరాటే పోటీలకు పట్టణానికి చెందిన షిటోరియా కరాటే విద్యార్థులు ఎంపికైనట్లు కాయ్ రిప్రి కమిషన్ కావేటి సమ్మయ్య బుధవారం తెలిపారు. కుమితి విభాగంలో మెట్టు హాసిని, బండారి మణికంఠ రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ఆయన వివరించారు. విద్యార్థులను పలువురు అభినందించారు.



క్లుప్తంగా

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుగ్లాంపల్లి గ్రామానికి చెందిన చిలుకల వినయ్(21) ప్రేమ విఫలం కావడంతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. వినయ్ పదో తరగతి వరకు చదివాడు. ప్రస్తుతం ఇంటి వద్దే ఖాళీగా ఉంటున్నాడు. ఓ యువతిని ప్రేమించగా, ఏమైందో ఏమోగానీ ఆ ప్రేమ విఫలమైంది. మనస్తాపం చెందిన యువకుడు ఈనెల 9న పురుగులమందు తాగాడు. స్థానికులు తండ్రికి సమాచారం ఇవ్వడంతో వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నాట్లు ఎస్సై వివరించారు.

అనుమానాస్పద స్థితిలో దివ్యాంగురాలి మృతి

పెద్దపల్లిరూరల్: నిట్టూరు గ్రామానికి చెందిన జోగుల శారద (30) అనే మానసిక దివ్యాంగురాలు బుధవారం అనుమానాస్పదస్థితిలో మరణించింది. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై లక్ష్మణ్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. తన కూతురును తిరుపతి అనే యువకుడే హతమార్చి ఉంటాడనే అనుమానిస్తూ మృతురాలి తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ వివరించారు. మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పేర్కొన్నారు.

పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయం జప్తు

- రైతులకు పరిహారం చెల్లింపులో జాప్యంపై కోర్టు ఆదేశం
- 19లోపు చెల్లిస్తామని ఆర్డీవో హామీతో జప్తు నిలుపుదల


పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్న కోర్టు సిబ్బంది, రైతులు

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా రామగుండం బీపీఎల్ పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం భూములు ధారాదత్తం చేసిన రైతులకు పరిహారం చెల్లింపులో జాప్యం కావడంతో ఆర్డీవో కార్యాలయాన్ని జప్తు చేయాలని గోదవరిఖని సీనియర్ సివిల్ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. కోర్టు ఆదేశాల మేరకు ఆర్డీవో కార్యాలయంలోని కంప్యూటర్లు, ఇతర సామగ్రిని జప్తు చేసేందుకు బుధవారం కోర్టు సిబ్బంది, భూనిర్వాసితులు, వారి తరపు న్యాయవాదులు ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఆర్డీవో గంగయ్య అందుబాటులో లేకపోవడంతో ఏవోకు నోటీసులు అందజేశారు. దీంతో కలెక్టర్, ఆర్డీవోలు భూనిర్వాసితుల తరఫున వచ్చిన న్యాయవాదులతో చర్చించి ఈనెల 19వ తేదీలోగా పరిహారం చెల్లిస్తామని లిఖితపూర్వక హామీ ఇచ్చారు. అధికారుల విన్నపం మేరకు కోర్టు సిబ్బంది ఆర్డీవో కార్యాలయం జప్తు యత్నాన్ని విరమించుకున్నారు.

పరిహారం కోసం ఎదురుచూపులు..

నిర్వాసితులు తరపు న్యాయవాది మందల విక్రం రెడ్డి, రైతు బోడకుంట సత్యరాజ్ కథనం ప్రకారం.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రామగుండం మండలంలో బీపీఎల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మించేందుకు అప్పటి సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. దీంతో రామగుండం మండలంలోని బ్రహ్మణపల్లి, మల్యాలపల్లి, కుందనపల్లి, రాయదండి గ్రామాల్లో దాదవు 300మంది రైతుల నుంచి 1,200ఎకరాల వ్యవసాయ భూములను సేకరించారు. ఇందులో తరి రకం భూములకు ఎకరాకు రూ.32వేల - రూ.42వేలు, ఖుష్కీ రకానికి రూ.16వేల - రూ.22వేల వరకు పరిహారం చెల్లించేలా ఒప్పందం జరిగింది. అయితే, ప్రభుత్వం చెల్లించే పరిహారం తక్కువగా ఉందని 36మంది రైతులు 2004లో పెద్దపల్లి సబ్‌కోర్టును ఆశ్రయించారు. అయితే, తరి ఎకరాకు రూ.95వేలు, ఖుష్కీకి రూ.90వేల చొప్పున పరిహారం చెల్లించాలని 2005లో కోర్టు తీర్పు వెలువరించింది. పరిహారం పెంపును సవాల్ చేస్తూ రెవెన్యూ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. వీరితోపాటు బీపీఎల్ సంస్థ సైతం పరిహారం పెంపును తగ్గించేలా, తిరిగి కేసును పెద్దపల్లి కోర్టుకు బదిలీ చేసేలా కోర్టును ఆశ్రయించింది. హైకోర్టు పెంచిన పరిహారంలో తొలుత 50శాతం పరిహారాన్ని రెండు నెలల్లో చెల్లించాలని హైకోర్టు తీర్పు వెలువరించటంతో పాటు, కేసును పెద్దపల్లి సబ్ కోర్టుకు బదిలీ చేసింది. ఆరు నెలల్లో తుది తీర్పును వెలువరించాలని సూచించింది. అయితే, అధికారులు రైతులకు ఎలాంటి పరిహారం చెల్లించలేదు. పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయకపోవడంతో అప్పటి విద్యుత్ శాఖ సీఎండీ రేచల్ ఛటర్జీ బీపీఎల్‌తో ఉన్న ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారు. దీన్ని సవాల్ చేస్తూ బీపీఎల్ సంస్థ మళ్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. అప్పటి ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 9/14ను తీసుకొచ్చింది. ఒప్పందం రద్దు చేసుకున్నందున సేకరించిన భూములపై బీపీఎల్‌కు ఎలాంటి హక్కు లేదని సదరు జీవోలో పేర్కొంది. దీనితో ఏకీభవించిన పెద్దపల్లి సీనియర్ సివిల్ జడ్జి 2005లో ఇచ్చిన తీర్పును అమలు చేయాలని పేర్కొంటూ 2014లో రెవెన్యూ అధికారులను ఆదేశించింది. అధికారులు రైతులకు ఎటువంటి పరిహారం చెల్లించకపోవడంతో 36మంది రైతులు మరోసారి 2022లో పెద్దపల్లి కోర్టులో ఎగ్జిక్యూషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో 2023లో గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈపీ 7/2023గా నమోదు అయింది. మూడు నెలల్లో ఈపీలో పరిహారం డబ్బులు జమచేయాలని ప్రభుత్వాన్ని ఆ కోర్టు ఆదేశించింది. ఈఆ కోర్టు తీర్పు కాపీలు అందిన 3 నెలలకు సైతం రైతులకు పరిహారం అందలేదు. దీంతో 2 జూలై 2024న గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి బి.శ్రీనివాసులు ఆగస్టు 20లోపు కోర్టును ఆశ్రయించిన 36మంది రైతులకు రూ.2.12కోట్లు పరిహారం చేల్లించాలని, లేకుంటే పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయంలోని చరాస్తులను జప్తు చేయాలంటూ తీర్పు వెలువరించారు. దీంతో కోర్టు సిబ్బంది, నిర్వాసితులు బుధవారం ఆర్డీవో కార్యాలయం చేరుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల జోక్యంతోపాటు, ఈనెల 19లోపు పరిహారం జమచేస్తామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో కోర్టు సిబ్బంది వెనుదిరిగారు.

సింగరేణిస్థాయి ఉత్తమ ఉద్యోగులు వీరే

- నేడు కొత్తగూడెంలో సన్మానించనున్న సీఎండీ


అబ్దుల్ రజాక్


బానోత్ కార్తీక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ విభాగాల్లో ఉత్తమ ఉద్యోగుల(ఉత్తమ సింగరేణియన్లు- సంస్థ స్థాయి)ను ఎంపిక చేశారు. సంస్థ వ్యాప్తంగా 12మంది ఎంపికైన వారిలో ఉన్నారు. వీరికి కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో గురువారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో సీఎండీ బలరామ్ ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానిస్తారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిలో బొబ్బల మల్లారెడ్డి(ఈపీ ఆపరేటర్, కేటీకే ఓసీ, భూపాలపల్లి ఏరియా), అబ్దుల్ రజాక్(ఈపీ ఆపరేటర్, ఓసీపీ, ఆర్జీ-3 ఏరియా), బానోత్ కార్తిక్(ఫోర్మెన్ ఆటో/మెకానిక్, అడ్రియాల ప్రాజెక్ట్), నల్లా భిక్షపతి(ఈపీ ఆపరేటర్, జీడీకే ఓసీపీ-3, ఆర్జీ-2 ఏరియా), ఉబుతా బుచ్చయ్య(రాంకర్/షటిల్‌కార్ ఆపరేటర్ జీడీకే-11, ఆర్జీ-1), ఎంజారపు విజయ్‌కుమార్(ఈపీ ఫిట్టర్, ఖైరీగూడ ఓసీపీ, బెల్లంపల్లి ఏరియా), పొట్టా రాజలింగయ్య(హెడ్ ఓవర్‌మెన్, శాంతిఖని, మందమర్రి ఏరియా), కర్రె బీరయ్య(ఎస్‌డీఎల్ ఆపరేటర్- ఆర్కే-6 ఇంక్లయిన్, శ్రీరాంపూర్ ఏరియా), షేక్ మైబాషా(ఎలక్ట్రీషయన్, వర్క్‌షాపు, మణుగూరు ఏరియా), కొంగర వెంకటేశ్వర్లు(ఫిట్టర్, కేవోసీ, ఇల్లెందు ఏరియా), బనవెల్లి శ్రీనివాస్‌రావు(ఫిట్టర్, కిష్టారం ఓసీపీ, కొత్తగూడెం ఏరియా)తో పాటు మహమ్మద్ నిసారుద్దీన్(సీనియర్ అసిస్టెంట్, ఎస్‌టీపీపీ) ఉన్నారని జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్ బుధవారం వెల్లడించారు.

మహిళలకు ఆహార శుద్ధి కేంద్రాలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష


మిల్క్‌పార్లర్ ప్రారంభంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మాజీ సర్పంచ్ లక్ష్మి తదితరులు

ముత్తారం(మంథని): జిల్లాలో మహిళల ఆర్థికాభివృద్ధి కోసం స్వశక్తి మహిళా సంఘాలకు మీసేవ, ఆహార శుద్ధి కేంద్రాలు, పౌల్ట్రీ తదితర వ్యాపార యునిట్లు మంజూరు చేస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మైదంబండ, ముత్తారం, అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లిలో అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీతో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. మైదంబండ, అడవిశ్రీరాంపూర్‌లోని అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల ప్రగతిపై ఆరా తీశారు. అడవిశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్ ప్రహరీ మరమ్మతులకు అంచనాలు రూపొందించాలని పంచాయతీరాజ్ ఏఈ వరలక్ష్మిని ఆదేశించారు. ముత్తారంలో రాజమాత మహిళా సంఘం ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన శ్రీయాన్ మిల్క్ పార్లర్‌ను పారుపల్లి మాజీ సర్పంచ్ పర్శ లక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాగా, కాసార్లగడ్డలో కోళ్లఫామ్‌తో దుర్వాసనతో వస్తోందని, తాము అనారోగ్యం బారినపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వాహనానికి అడ్డుగా వెళ్లి నిలుచున్నారు. మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం జోక్యం చేసుకుని కలెక్టర్ వాహనాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. ఏదైనా సమస్య ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని, తద్వారా పరిష్కరించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు శాంతించారు. ఆ తర్వాత కలెక్టర్ ఖమ్మంపల్లిలో ఇసుక రీచ్‌లు పరిశీలించారు. డీఆర్డీవో రవీందర్, మైనింగ్ ఏడీ శ్రీనివాస్, తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో లలిత, ఐకేపీ డీపీఎం రవి, ఏపీఎం పద్మ, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మహిళా విభాగం అధ్యక్షురాలు గోవిందుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు

గోదావరిఖనిటౌన్: ఓపెన్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నామని స్థానిక ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్, సంజీవయ్య, అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ రాజిరెడ్డి, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు బుధవారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. సెప్టెంబర్ 10వ తేదీ వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మధ్యలో చదువు మానేసినవారు, వివిధ కారణాలతో చదువు కొనసాగించలేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 70956 78143 నంబరులో సంప్రదించాలని వారు కోరారు.

కాందిశీకుల సమస్య పరిష్కరిస్తాం

పెద్దపల్లిరూరల్: బర్మా, కాందిశీకుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడా రు. 30 ఏళ్లుగా అంతర్గాం స్పిన్నింగ్, వీవింగ్ మిల్లు లు మూతపడ్డాక వారి సమస్యలు, బకాయిలు తదితర అంశాలపై చర్చించి సూచనలు చేశారు. సమావేశంలో ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ రమేశ్, చేనేత, జౌళిశాఖ ఏడీ చరణ్, డీఎల్‌పీవో వేణుగోపాల్, కార్మికశాఖ అధికారి హేమలత, పీఎఫ్ అధికారి తానయ్య, సంతోష్‌కుమార్ తదితరులుఉన్నారు.

జీజీహెచ్‌లో తొలి మోకీలు మార్పిడి

- వృద్ధురాలికి ఆపరేషన్ సక్సెస్


వైద్యులను అభినందిస్తున్న సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, పక్కన పేషెంట్ లింగమ్మ

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో తొలిసారి ఓ వృద్ధురాలికి మోకీలు(టీకేఆర్) శస్త్రచికిత్స ఉచితంగా చేసి ప్రశంసలు అందుకున్నారు. బాధితురాలు బుధవారం సులభంగా నడటంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. గోదావరిఖని సంజయ్‌నగర్‌కు చెందిన ఆర్.లింగమ్మ(63) ఏడాదిగా రెండు మోకాళ్లతో నరకయాతన అనుభవిస్తోంది. జీజీహెచ్ వైద్యులకు తన బాధ చెప్పింది. పరీక్షించిన డాక్టర్లు.. నొప్పి అధికంగా ఉన్న ఎడమ కాలుకు తొలత శస్త్ర చేయడానికి నిర్ణయించారు. ఈనెల ఒకటో తేదీన ఆర్థోపెడిక్‌లు రాజు, నాగిరెడ్డి, యాకూబ్‌తోపాటు అనెస్తీషియా ఆధ్వర్యంలో మోకీలు మార్పిడి ఆపరేషన్ విజయంతంగా నిర్వహించారు. బుధవారం లింగమ్మను సపోర్టు లేకుండానే నడిపించారు. సులువుగా నడవడంతోపాటు నొప్పి లేకపోవడంతో వైద్యులకు కృతజ్ఞతలు తెలిపింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, ఆర్ఎంవో అరుణ బాధితురాలిని అభినందించారు. జిల్లాలోనే తొలిసారి విజయంతంగా మోకీలు మార్పిడి చేసిన వైద్యులనూ అభినందించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒక కాలు మోకీలు ఆపరేషన్‌కు రూ.2లక్షల - రూ.3లక్షల వరకు ఖర్చవుతుందని, జీజీహెచ్‌లో ఉచితంగా సేవలు అందించామని వివరించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

- 4 కేజీల గంజాయి స్వాధీనం


నిందితుడిని విచారణ చేస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గంజాయి తరలిస్తున్న వ్యక్తిని స్థానిక చెరువుకట్ట సమీపంలో పట్టుకున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఎర్కలగూడెం(లింగాపూర్)కు చెందిన బద్దిపడిగే సంజీవరెడ్డి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇలా వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ సాధ్యం కావడం లేదు. ఈ విషయాన్ని ఒడిశాలోని తన బావ రాజారామ్‌కు వివరించాడు. అధిక డబ్బులు ఎలా వస్తాయని అడిగాడు. అతడి సూచన మేరకు మంగళవారం హుజూరాబాద్ వెళ్లిన సంజీవరెడ్డి.. అక్కడ ఇద్దరిని కలిశాడు. వారు ఇచ్చిన గంజాయి తీసుకుని ద్విచక్ర వాహనంలో పెట్టుకుని ఓ వ్యక్తికి ఇచ్చేందుకు గోదావరిఖని బయలు దేరాడు. ఈక్రమంలో సుల్తానాబాద్‌కు చేరుకోగా పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండడాన్ని చూశాడు. అక్కడి నుంచి సంజీవరెడ్డి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అప్రమత్తమై నిందితుడిని పట్టుకున్నాడు. అతడి నుంచి 4కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై వివరించారు.

బేగంపేట పశువైద్య కేంద్రం తనిఖీ


మాట్లాడుతున్న వెటర్నరీ డాక్టర్ శంకర్

రామగిరి(మంథని): బేగంపేట పశువైద్య కేంద్రాన్ని జిల్లా పశువైద్యాధికారి శంకర్ బుధవారం తనిఖీ చేశారు. జిల్లాలో 3,31,000 గొర్రెలకు నీలినాలుక వ్యాధి నివారణ టీకాలు వేశామని తెలిపారు. రెండోవిడత గొర్రెల పంపిణీ పథకం కింద 10,500 యూనిట్లు మంజూరు కాగా 2,957 మంది డీడీలు చెల్లించారన్నారు. ఇందులో 1,267 యూనిట్లు కొనుగోలు చేశామని, మిగతా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమచేశామని గుర్తుచేశారు. 96 యూనిట్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. మండల పశువైద్యాధికారి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చిత్తు, బొత్తు ఆడుతున్న వారిపై కేసు

జ్యోతినగర్(రామగుండం): చిత్తు-బొత్తు(బొమ్మా బొరుసు) ఆడుతున్న 14 మందిపై బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుస్టేషన్ పరిధిలోని అంకమెట్టు, జయ్యారం గ్రామ శివారులో కొంతమంది డబ్బులు పెట్టి చిత్తు-బొత్తు ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బొమ్మాబొరుసు ఆడుతున్న 14 మంది కనిపించగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.75,800 నగదు, 14 సెల్‌ఫోన్‌లు, ఆరు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామచంద్రం, లక్ష్మికి గాయాలయ్యాయి. రంగాపూర్ గ్రామానికి చెందిన రామచంద్రం, లక్ష్మి బొంపల్లిలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని స్థానికులు 108 వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి


ప్రసన్న(ఫైల్)

ముత్తారం(మంథని): రంగయ్యపల్లికి చెందిన సోమిశెట్టి ప్రసన్న(17) చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సామిశెట్టి నారాయణ - లక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్దకూతురు ప్రసన్న పెద్దపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతోంది. ఈనెల 12న జ్వరం రాగా ఓ ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించారు. కాసేపటికే ప్రసన్న అపస్మారక స్థితిలోకి వెళ్లింది. తల్లిదండ్రులు మంథనిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పట్టించుకోలేదు. దీంతో హైదరాబాద్‌లోని మూడు ఆస్పత్రులకు వెళ్లినా చేదు అనుభవమే ఎదురైంది. చివరకు అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ చనిపోయింది. ప్రసన్నకు తొలుత వైద్యం ఎవరు చేశారని అక్కడి వైద్యులు కుటుంబసభ్యులను ప్రశ్నించి ఫోన్ ద్వారా సంప్రదించి ఆర్ఎంపీపై మండిపడ్డారు. గ్రామీణ వైద్యుడి వైద్యం వికటించడంతో బాలిక మృతి చెందిందని వైద్యులు నిర్ధారణకు వచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారు.

సీబీఎస్ఈ విద్యాబోధనకు సన్నద్ధం

- మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక
- విద్యార్థులకు కోసం నాణ్యమైన విద్య
- వచ్చే ఏడాది నుంచే కొత్త విద్యావిధానం
- తొలిదశలో సింగరేణిలోని రెండు స్కూళ్ల ఎంపిక



సింగరేణిలోని స్కూళ్లు	9
చదువుతున్న విద్యార్థులు	6,000 పైగా
సిబ్బంది	1,000కి పైగా

గోదావరిఖని: సింగరేణి ఉద్యోగులు, ప్రభావిత, నిర్వాసితుల పిల్లలకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) విద్యావిధానం ద్వారా నాణ్యమైన విద్య అందించేందుకు యాజమాన్యం రెండు పాఠశాలలను ఎంపిక చేసింది. ఇందులో పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేస్తోంది. మౌలిక వసతుల కల్పనకు పక్కా ప్రణాళిక రూపొందించింది. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ అధీనంలోని సీబీఎస్ఈకి ఇటీవల దరఖాస్తు చేసినట్లు సీఎండీ బలరాం తెలిపారు.

తొమ్మిది స్కూళ్ల బలోపేతంపై దృష్టి

- సింగరేణిలోని మొత్తం తొమ్మిది స్కూళ్లలో విద్యావిధానాన్ని మరింత బలోపేతం చేయడంపై యాజమాన్యం దృష్టి సారించింది.
- కారుణ్య నియామకాల ద్వారా సుమారు 16వేల మందికిపైగా యువ ఉద్యోగులు సంస్థలో చేరడంతో వారి పిల్లలకు సీబీఎస్ఈ విద్యావిధానం ప్రవేశపెట్టాలని నిర్ణయించింది.
- ఈవిషయంలో కార్మిక సంఘాల నాయకుల నుంచి కూడా డిమాండ్ పెరుగుతోంది.
- సంస్థ పరిధిలో 9 పాఠశాలలు, ఒక పాలిటెక్నిక్, మహిళా డిగ్రీ కళాశాల ఉన్నాయి.
- వీటి ద్వారా ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్య అందుతోంది.
- ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి.

తగ్గుతున్న కార్మికుల సంఖ్య..

సింగరేణిలో ఏటా కార్మికుల సంఖ్య తగ్గిపోతోంది. ఇదే సమయంలో సింగరేణి స్కూళ్లకు ఆదరణ కూడా తగ్గిపోతోంది. 1990కి ముందు సంస్థలో సుమారు 1.25లక్షల మందికిపైగా ఉన్న ఉద్యోగులు.. ప్రస్తుతం 40 వేలకు తగ్గిపోయారు. ఇందులోని చాలామంది కార్మికుల పిల్లలు యుక్త వయసువారే. దీంతో సుమారు 60శాతం మంది కార్మికేతర పిల్లలను సింగరేణి పాఠశాలల్లో చేర్పుకుంటున్నారు.

త్వరలోనే కేంద్ర బృందం రాక..

సింగరేణి సీఎండీ లేఖ స్వీకరించిన కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని సీబీఎస్ఈ ప్రధాన కార్యాలయం నుంచి ఉన్నతస్థాయి బృందం త్వరలోనే ఇక్కడ పర్యటించనుంది. ఈ బృందం పాఠశాలలను సందర్శించి తరగతి గదులు, పాఠశాల క్రీడా మైదానం, ప్రయోగశాలలు, ఇతర మౌలిక వసతులపై ఆరా తీస్తుంది. దీనిపై నివేదిక తయారు చేసి తమశాఖ ఉన్నతాధికారులకు నివేదించనుంది. ఈప్రక్రియ మూడు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉంది.

కేంద్ర బృందం సంతృప్తి చెందితేనే..

- కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ వసతులపై సంతృప్తి చెందితే ప్రాథమికంగా రామగుండం రీజియన్‌లోని యైటింక్లయిన్‌కాలనీ సింగరేణి స్కూల్‌లో సీబీఎస్ఈ విధానంలో విద్యాబోధన ప్రారంభించేందుకు అవకాశం ఉంటుంది.
- ఇదే పాఠశాలలో గతేడాది పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- తెలంగాణ రాష్ట్ర సెకండరీ విద్య విధానం నుంచి సీబీఎస్ఈ విధానంలోకి మారడానికి తమకు అభ్యంతరం లేదని రాష్ట్ర విద్యాశాఖ నుంచి అనుమతి లేఖ(నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) కూడా సింగరేణి సంస్థ పొందింది.
- దశలవారీగా శ్రీరాంపూర్ ఏరియాలో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.
- ఈమేరకు ఇప్పటికే సింగరేణిలో ఉన్న అన్ని ఉన్నత పాఠశాలలను ఆధునీకీకరిస్తున్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. వ్యవస్థను మొత్తం కంప్యూటరీకరిస్తున్నారు. ల్యాబ్‌లు తదితర సౌకర్యాల కోసం అవసరమైన అనుమతులు ఇప్పటికే మంజూరు చేశారు.